
నూరేళ్ళ తెలుగు కథకు
నవ్య నీరాజనం - 81
నూరేళ్ళ తెలుగు కథకు



# తెలుగు కథ 'గాలివాన' కాదు! పెద్ద సునామీ!


- సింహప్రసాద్

ఆయన కవిత రాస్తే బహుమతి. కథ రాస్తే బహుమతి, నవల రాసినా, నాటకం రాసినా ఏది రాసినా బహుమతి తప్పని సరి. ఆయన్నంతా 'పోటీల రచయిత' అంటారు. సాహితీ ప్రక్రియల్లోనే కాదు, జీవితంలో కూడా పోటీ పడి నెగ్గుకొచ్చారాయన. రచనను ఓ బాధ్యతగా, బాధ్యతను ఓ రచనగా ఎల్లప్పుడూ భావించే చెలంకూరి వరహ నరసింహ ప్రసాద్ అలియాస్ 'సింహప్రసాద్'తో ఇంటర్వ్యూ ఈ వారం...

పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం మండలం మల్లవరం గ్రామంలో పుట్టాను. పుట్టిన తేదీ తెలీదు. భోగికి రెండ్రోజులు ముందు పుట్టాననేది మా అమ్మ. సంవత్సరం తెలీదు. నాలుగవ తరగతి నుండి ఆరవ తరగతికి జంప్ చేసినప్పుడు మా సూర్యం మాస్టారు 15.5.52న పుట్టానని రాశారు.

మా అమ్మా నాన్నలు చెలంకూరి తాయారమ్మ, నరసింహమూర్తి. మాది సన్నకారు రైతు కుటుంబం. మేం అయిదుగురం అన్నదమ్ములం. నేను రెండో వాణ్ణి. ఇద్దరు చెల్లెళ్ళు.

'సింహప్రసాద్' పేరుతో రచనలుచేసే నా పూర్తి పేరు చెలంకూరి వరహ నరసింహ ప్రసాద్. మా ఇంట్లోనూ మా ఊళ్లోనూ 'గాంధీ' అని పిలుస్తారు



భార్య శ్రీహరి కుసుమాంబతో...

## చదువుల ఆస్తి

నా బాల్యం చదువూ 'కష్టాలమయం' అనలేను గాని 'చాలా ఇబ్బందికర స్థితి' లోనే గడిచింది. డిగ్రీ చదివేప్పుడు నాకు రెండు జతల దుస్తులే! అవైనా కుర చవే వుండేవి. ఆర్థిక పరిస్థితి అనుకూలించకపోయినా బంధువులు వారించినా తల్లిదండ్రులు మమ్మల్ని చదివించారు. తరగని 'చదువుల ఆస్తి' ఇచ్చారు. వారి ఋణం కొంతైనా తీర్చుకోవడానికి వారి పేరున విరాళాలిస్తున్నాను. మా ఊరి హైస్కూల్లో టెన్త్‌లో ఫస్ట్, సెకండ్ వచ్చిన విద్యార్థులకు ప్రతి ఏటా వారి పేరున నగదు పురస్కారాలతో అవార్డులిస్తున్నాను. పిడకలు, నెయ్యి అమ్మి నా పుస్తకాలకీ ఫీజులకీ అనేకసార్లు డబ్బు సర్దిన మా నానమ్మ మహాలక్ష్మమ్మని ఈ సందర్భంగా గుర్తు చేసుకోవడం అవసరం. ఆవిడ ప్రభావం నా మీదా నా రచనల మీదా చాలా వుంది. నా మొదటి కథా సంపుటి 'వేళ్ళు' ఆవిడకే అంకితమిచ్చాను. పశువుల్ని మేపడంలోనూ పిడకలు చేయడంలోనూ తోడ్పడుతూనే చదువుకునే వాణ్ణి. మొదట్నుంచీ మెరిట్ స్టూడెంటునే! హైస్కూల్లోనూ కాలేజీలోనూ ఇచ్చిన మెరిట్ స్కాలర్‌షిప్ బాగా ఆదుకుంది. మల్లవరం, మత్స్యపురి, నర్సాపురంలలో విద్యాభ్యాసం చేశాను. 1972లో శ్రీ వైఎన్ కాలేజీలో బి.ఎస్సీ. కాలేజ్ ఫస్టుతో పాసయ్యాను.

## శ్రీశ్రీ స్ఫూర్తి

పుస్తకాలంటే చిన్నతనం నుంచీ కూడా నాకెంతో ఇష్టం. కనబడిన ప్రతి పుస్తకాన్నీ పేపర్నీ చదివేసే వాణ్ణి. మా ఊళ్ళోని యువకులు కొన్నాళ్ళు నడిపిన గ్రంథాలయం లోని (దాని స్థాపనకు చేసిన శ్రమదానంలో నేనూ పాల్గోవటం ఓ తీపి గుర్తు) పుస్తకాలన్నీ హైస్కూల్లో వుండగానే చదివేశాను. పదవ తరగతిలో ఉండగా నా క్లాస్‌మేట్ క్రీస్తుపాటల బుల్లి పుస్తకం తెచ్చిచ్చాడు. సినిమా పాటల బాణీలో రాసినవవి. అది చదివేక 'మా దేవుడు తక్కువా?' అన్న ఆవేశం వచ్చింది. వెంటనే వాటిని అనుకరిస్తూ వేంకటేశ్వరస్వామి మీద రెండ్రోజుల్లో పది పాటలు రాసేశాను. అవే సాహిత్యంలో నాకు తెలీకుండా పడిన తొలి అడుగులు. ఎస్సెస్ఎల్సీలో ఛందస్సుతో కుస్తీ పట్టి అరడజను పద్యాలు రాశాను. కాలేజీలో చదివేప్పుడు వామపక్ష విద్యార్థి సంఘ కార్యక్రమాల్లో పాల్గొన్నాను. శ్రీశ్రీగారి 'మహాప్రస్థానం' నన్ను బాగా ఆవేశపరిచింది. స్ఫూర్తినిచ్చింది. రాయకుండా వుండలేనంత ఉద్విగ్న పరచింది. ప్రతి అన్యాయపు సంఘటనకూ ప్రతి స్పందిస్తూ కవితలూ పాటలూ రాశాను. ఎవరికీ చూపించలేదు. ధైర్యం లేకపోయింది.

## ఉత్తేజపరిచిన సాహిత్య సభలు

1972 నుండి 1975 వరకూ మొదట నిరుద్యోగిగా తర్వాత ఉద్యోగిగా హైదరాబాద్‌లో వున్నాను. యువభారతి, అరసం, విరసం, నవోదయ సాంస్కృతిక సంస్థ తదితర సంస్థలు ఆంధ్ర సారస్వత పరిషత్‌లోనూ శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయంలోనూ జరిపిన అన్ని సభలకూ తప్పనిసరిగా వెళ్ళేవాణ్ణి. మహాకవి శ్రీశ్రీ, ఆరుద్ర, రావిశాస్త్రి, దాశరథి, సి.నారాయణరెడ్డి, జ్వాలాముఖి, చెరబండరాజు, భీమన్న, సుబ్రహ్మణ్యం, వరవరరావు, రంగాచార్య మొదలైన వారి ఉపన్యాసాలు నన్ను బాగా ప్రభావితం చేశాయి. తీరిక దొరికితే చాలు సిటీ సెంట్రల్ లైబ్రరీ కెళ్ళి పుస్తకాలలో మునిగిపోయే వాణ్ణి.

బెంగాలీ, కన్నడ, తమిళ, మళయాళ ఆర్ట్ సినిమాలు రవీంద్రభారతిలో చూసిన నాటకాలూ ఉత్తేజపరిచేవి. అప్పటి హైదరాబాద్ సాహిత్య సాంస్కృతిక వాతావరణం నేను రచయితగా రూపుదిద్దుకోడానికి కారణభూతమైందని చెప్పాలి.

## ఉద్యోగం-వ్యాపారాలు

బ్యాంకు ఉద్యోగస్తుణ్ణవ్వాలన్న నా కల 1974లో ఇండియన్ బ్యాంక్‌లో క్లర్క్‌గా చేరడంతో తీరింది. అంకితభావం గల ఉద్యోగిగా మన్ననలందాను. ప్రతి సారీ తొలి అర్హత పరీక్షలోనే ప్రమోషన్లు పొందాను. ఉత్తమ మేనేజ్‌మెంట్‌కీ కస్టమర్ సర్వీసుకీ అవార్డులు పొందాను. 2001లో సీనియర్ మేనేజర్‌గా పనిచేస్తూ



విహారి, సిరాజ్, వేదగిరి రాంబాబు తదితరులతో...

స్వచ్ఛంద పదవీ విరమణ చేశాను. వ్యాపారం మీద గల మక్కువ లేదా ఆకర్షణతో బాటు 27 ఏళ్ళ ఉద్యోగ జీవితం ఇక చాలనుకోవడమే దాని క్కారణం. నాకు నేను బాస్‌ని కావాలనుకున్నాను. వ్యక్తిగా నా శక్తేమిటో ఋజువు చేసుకోవాలనుకున్నాను. పదిమందికీ నేను ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలనుకున్నాను. 49 ఏళ్ళ వయస్సులో అలాటి నిర్ణయం తీసుకోవడం సాహసమే అయినా ఛాలెంజీగా తీసుకొన్నాను. 28.2.01న బ్యాంకు నుండి రిలీవ్ అయ్యాను. 12.3.01న నా అభిమాన రచయిత శ్రీశ్రీగారి పేరు మీద హైదరాబాద్, కె.పి.హెచ్.బి.లో 'శ్రీశ్రీ అకాడమి' ప్రారంభించాను. దీన్ని శ్రీ చుక్కా రామయ్య గారి చేత ప్రారంభింప చేయడం జరిగింది. 2003లో ఇంటర్మీడియట్ బోర్డు అనుమతితో శ్రీశ్రీ ఒకేషనల్ జూనియర్ కాలేజీని స్థాపించి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నాను.

## నచ్చినవి

| | | |
|---|---|---|
| ఊరు | : | నర్సాపురం |
| రచయితలు | : | శ్రీశ్రీ, రా.వి.శాస్త్రి, శరత్‌బాబు |
| నటీనటులు | : | సావిత్రి, నాగేశ్వరరావు, నాగార్జున, కమల్‌హాసన్ |
| పుస్తకం | : | మహాప్రస్థానం |
| వంటలు | : | క్షీరాన్నం, గారెలు |
| ఇష్టం | : | వర్షాన్ని చూస్తూ కూర్చోవడం, ఆశావహ దృక్పథం |
| బాధించిన ఘటన | : | మా నాన్న చనిపోయినప్పుడు మా సోదరుల ప్రవర్తన |
| అయిష్టం | : | ఇతరుల గురించి చెడుగా మాట్లాడటం, నెగిటివ్ అప్రోచ్ |

### నా విజయం వెనుక...

నా శ్రీమతి పేరు శ్రీహరి కుసుమాంబ. 1977లో మా పెళ్లయ్యింది. ఆవిడ నా వృత్తిలోనూ ప్రవృత్తిలోనూ సక్సెస్‌కి ప్రథమ కారణం. రచనలు ఫెయిర్ చెయ్యడానికి నాకు సమయం ఉండట్లేదని చెప్పి 40 ఏళ్ల వయసులో తెలుగుటైపు నేర్చుకుంది. నా రచనల్ని చక్కగా టైపు చేసి అందిస్తోంది. అందువల్లే రాయగలుగుతున్నాను. మాకు ముగ్గురబ్బాయిలు. సుభాష్‌చంద్ర, శ్రీసూర్యసింహ, క్రాంతి కుమార్. ఇద్దరికి పెళ్లిళ్లయ్యాయి. కోడళ్లు దివ్య, శ్రీదేవి. వీరందరూ ఇంజినీర్లే! అంతా అమెరికాలో వుంటున్నారు.

### నేపథ్యం

నా రచనలన్నీ నేలమీదే నడుస్తాయి. విన్నవి కన్నవి చూసినవి చదివినవి లేదా అనుభవంలోకొచ్చిన వాటి నుండి ప్రేరణ పొందుతాను. కల్పన జోడించినా వాస్తవానికి దూరంగా జరగను. నేను అనుభూతి చెందితేనే తప్ప రాయలేను. ఒకసారి భావోద్వేగానికి లోనైతే మరి రాయకుండా వుండలేను. నా రచనల్లో సెంటిమెంటు ఎక్కువ. మా ఊరి మట్టివాసనా, గోదావరి నీటి రుచీ, వివిధ ప్రదేశాల్లో నేను పీల్చిన 'గాలి' స్పృహ నా రచనల్లో ప్రతిబింబిస్తూంటాయి. మానవ సంబంధాలకూ ఉన్నత జీవిత విలువలకూ పెద్ద పీట వేస్తాను. నేను రాసినవన్నీ సాంఘికాలే! ఇటీవలే పిల్లల కోసం ఓ జానపద నవల రాశాను. అది ఓ దినపత్రికలో రానుంది.

### నా పాత్రను చక్కగానే పోషిస్తున్నాను

1976లో అనుకుంటాను ఇండియన్ బ్యాంక్, కామవరపు కోట బ్రాంచిలో పని చేస్తున్నప్పుడు ఒకాయన రోడ్డుమీద ఆపి ''మీరెప్పుడూ నవ్వుతూనే వుంటారండీ'' అన్నాడు. ఎప్పుడూ నవ్వుతూ సంతోషంగా వుంటాను. అది లేదు. ఇది దక్కలేదు అన్న బాధ, విచారం నాకు మొదట్నుంచీ లేవు. ఉన్నదానితో తృప్తి పడతాను. మరింత ఉన్నతికి పట్టుదలతో కృషి చేస్తాను. ఎవర్నుంచీ ఏమీ ఉచితంగా ఆశించను. దేవుణ్ణి ఏమీ అర్థించను. నేను చేయగల సాయం ప్రతిఫలాపేక్ష లేకుండా చేస్తాను. నా సంపాదనలో కొంత సత్కార్యాలకి వినియోగిస్తుంటాను. అందరి శుభక్షేమాలూ ఆశిస్తాను.ఉత్తమ కొడుకుగా, అల్లుడిగా, సోదరుడిగా, భర్తగా, తండ్రిగా, మిత్రుడిగా, ఉద్యోగిగా యజమానిగా, పౌరుడిగా, వ్యక్తిగా...వుండటమే నా లక్ష్యం. ఆ పాత్రలన్నీ ఇంతదాకా సంతృప్తికరంగా నిర్వహించానని ధీమాగా చెప్పగలను.




### నా సాహిత్య ప్రస్థానం

కవిత, కథ, నాటిక, నవల...అన్ని ప్రక్రియల్లోనూ రచనలు చేశాను.

తొలి కవిత 'కోరిక' 1973లో ప్రగతిలో, తొలికథ 'కథగా ముగియని కథ' అదే సంవత్సరం స్వాతిలో ప్రచురించబడ్డాయి. మొదటి నవల 'డబ్బు' 1977లో ఆంధ్రజ్యోతి నవలా ప్రియదర్శిని పోటీలో బహుమతి పొందింది. ఇంతవరకూ 195 కథలూ, 45 నవలలూ ప్రచురించబడ్డాయి. 17 నవలలు సీరియళ్ళుగా వచ్చాయి. రెండు కథా సంపుటాలు 'వేళ్ళు' (1977), 'బోన్సాయ్ మనుషులు' (2007) వెలువడ్డాయి.

### జీవిత సాఫల్య గ్రంథం

భారతీయ వివాహ వ్యవస్థ ఔన్నత్యాన్ని వివరిస్తూ మనిషికి డబ్బే సర్వస్వం కాకూడదని హెచ్చరిస్తూనే సత్వగుణ సంపన్నతతో బతుకుపండించు కోవాలంటూ 'వివాహ వేదం' రచించాను. వివాహానికి ముందు, వివాహ కాండ, వివాహం తర్వాత అంటే జననం నుంచి మరణం వరకు మనిషి అన్ని దశలనీ ఇందులో పొందుపరిచాను. ఇది రెండేళ్ళ శ్రమ ఫలం. తి.తి.దే. వారి ఆర్థిక సహాయంతో ప్రచురింపబడింది.

### నేటి కథా సాహిత్యం గురించి...

జీవితం నుంచే కథలు పుడతాయి. పుట్టాలి. సాహిత్యం జనహితం కోరాలి. మంచిగా మనిషిగా బ్రతకమని బోధించాలి. ఆశావహదృష్టిని కల్గించాలి. మనసుని తడిమి క్షణమైనా ఆలోచింపచేసే ప్రతీ కథా నా దృష్టిలో ఉత్తమ కథే!

గ్లోబల్ విలేజ్ నేపథ్యం వల్ల కథ పరిధి విస్తృతమయింది. వివిధ సంస్కృతుల మీడియాలతో బాటు 'వ్యాపార' ప్రభావమూ అధికంగా వుంటోంది. అయినప్పటికీ చక్కని వైవిధ్య భరిత కథలు, మనసు లోతుల్లోకి మనిషి మూలాల్లోకీ తొంగి చూస్తున్నవెన్నో వస్తున్నాయి. పాతతరం కథకుల్ని వారిబాటనీ గౌరవించాల్సిందే! అలాగని నేటి కథకుల్ని చిన్నచూపు చూడడం సరికాదు. వర్తమాన వర్ధమాన కథకుల వస్తు వైవిధ్యాన్నీ, శైలీ విన్యాసాల్నీ గుర్తించడం అవసరం. నేటి కాలమాన పరిస్థితుల్నీ వాటి ప్రభావాలనీ పత్రికల వ్యాపార ధోరణినీ మారుతోన్న పాఠకుల అభిరుచినీ సైతం గమనంలోకి తీసుకొని కొత్త తరం కథకుల ప్రతిభను అంచనా వేయాలి. ఉత్తమ కథకుల్ని గుర్తించి ప్రోత్సహించాలి. అప్పుడే మరిన్ని గొప్ప కథలొస్తాయి. ప్రపంచ కథతో పోటీ పడతాయి. 'గాలివాన'లు కాదు సునామీలు సృష్టింపబడతాయి.

– సూర్య చంద్ర కుమార్

## నాకు నచ్చిన నా కథ

# నా స్వప్న

**- సింహప్రసాద్**

"ఒరేయ్ అబ్బాయ్! నేనూ, మీ నాన్నా మనూరెళ్ళి ఓ పదిరోజులుండి వస్తాం రా" నా తరపున శ్రీమతి అంది మా పెద్దబ్బాయి వాసుతో.

"ఎక్కడికి? ఆ పల్లెటూరికా?" వెటకారంగా అన్నాడు నవ్వుతూ వాసు.

మొఖం తిప్పేసుకున్నాను. కాని శ్రీమతి వూరుకోలేదు. "అక్కడికేరా. మీ నాన్నకీ మహాపట్నంలో బొత్తిగా వూపిరాట్టంలేదుట. ఓ వారం పది రోజులక్కడ వుండి వస్తే బావుంటుందనీ..."

"నాన్న ఆరోగ్యం ఎలావుందో తెలిసి కూడా నువ్వాయనకి వంతపాడితే ఎలాగమ్మా! ఆ పల్లెటూళ్ళో ఆయనకి ట్రీట్‌మెంటివ్వడానికి డాక్టరు కాదు కదా కాంపౌండరు కూడా దొరకడని నీకు తెలుసుగా. అయినా కాలక్షేపానికిక్కడ బోల్డన్ని బుక్కులూ, పార్కులూ, సినిమాలూ, సభలూ, వుపన్యాసాలూ వున్నాయ్. అక్కడేమున్నాయ్ మట్టీ మశానం తప్ప?"

"ఏమోరా! అవన్నీ మాకు తెలీవుగాని మనవాళ్ళంటూ వున్న పల్లెటూళ్ళో మనదంటూ వున్న ఇంట్లో వుంటే మీ నాన్నకి నాకు కూడా ప్రాణం హాయిగా వుంటుందనుకో, ఇక్కడీ అద్దె కొంపల్లో ఈ వాతావరణంలో ఏదో ఇరుగ్గా వున్నట్టుటుందిరా".

నిజం చెప్పొద్దూ మా ఇల్లంటే నాకెంతో ఇష్టమని శ్రీమతికి తెలుసు. నా ఇష్టమే ఆవిడిష్టం. ఇప్పుడే కాదు, పెళ్లైనప్పటినుంచీ అంతే!

"అదీ అలా చెప్పు. ఎలా అయితే లిక్కూ లిక్కూమంటూ బీసీనాటి ఓ పాడుపడిన కొంప కొన్నాడు కదా! దాని మీద దేర్ఘం తిరిగుంటుంది. కదమ్మా?"

వాడి ఎత్తుపొడుపుకి నాకు చాలా బాధన్పించింది. వీడేకాదు రెండో వాడూ అంతే. వాళ్ళకి నేను కన్నతండ్రినే అయినా వాళ్ళు నా మాటెప్పుడూ వినరు. అందుకు బాధలేదుగాని ప్రతిదానికి నన్నూ, నా పనుల్నీ గేలిచేస్తుంటారు. అది తరాల అంతరాల ఫలితం కావొచ్చు. మా హోదాల తేడాల వల్లనూ అవ్వొచ్చు. ఎంచేతంటే నేనో రిటైర్డ్ టీచర్ని. వాళ్ళు మంచి పొజిషన్లో వున్న ఉద్యోగులు. వాళ్ళు ప్రారంభ జీతమంత జీతం నేను రిటైరయ్యేముందు కూడా తీసుకోలేదు. అంచేత కాబోలు నాకంటే గొప్పగా ఫీలవుతూ "నీకేం తెలుసోయ్ నువ్వో బ్రతకలేని బడిపంతులువీ' అన్నట్టు చూస్తారు, ప్రవర్తిసారు!

వాడి మాటలకి ఒళ్ళుమండి అంది నా భార్య. "పాడుదో బీడుదో ఏదో మా శక్తి కొద్దీ కొన్నాం. ఆయనకి వాళ్ళ నాన్న రెక్కలే ఇచ్చారు. మీకాయన ఆ పాడుబడ్డ ఇల్లు ఇస్తారు. మీరు మీ పిల్లలకేం ఇస్తారో మేం చూళ్ళేక పోయినా మీరు చూడరా? అప్పుడు మీకు తెలిసిరాదా?"

"ఈ మాత్రం దానికింత రాద్ధాంతం ఎందుకులే? అలాగే వెళ్ళండి. అక్కడ పది రోజులేం ఖర్మ. ఏకంగా ఓ సంవత్సరమే వుండి రండి ఎవరొద్దన్నారూ?" అనేసి వెళ్ళిపోయాడు విసురుగా వాసు.

వాడి మాటలకు నా మనస్సు చివుక్కుమన్న మాట నిజమే కాని మొత్తానికి ఒప్పుకున్నందుకు సంతోషం వేసిందనే చెప్పాలి.

ఇప్పుడేకాదు ఆ ఇంటి వ్యవహారంలో మొదట్నుంచీ పిల్లలిద్దరూ కూడా నాకు వ్యతిరేకం గానే వున్నారు. ఇల్లు కొనడమో లేక ఓ చిన్నఇల్లు కట్టడమో చేద్దామని నేను అతికష్టం మీద సమకూర్చిన డబ్బు మీద ఇద్దరి దృష్టీ పడింది. ఎంతైనా ఎదిగిన కొడుకులు కదాని ఇల్లు కొనబోతున్నానని ఇద్దరికీ ఉత్తరం ముక్కరాస్తే తిరుగుటపాలో ఇద్దరూ వచ్చేశారు. ఆ డబ్బుతో బిజినెస్ చేస్తాను నాకివ్వమంటూ పెద్దోడు కూర్చుంటే, మేముండే టౌన్లో స్థలం చీప్‌గా దొరుకుతోంది. ముందు

---

### ఎందరో మెచ్చిన కథ



1970లలో అద్దె ఇంటి యజమానులు సవాలక్ష ఆంక్షలు విధించేవారు. చనిపోతే ఇల్లు మైల పెట్టాల్సి వస్తుందని భయపడేవారు. ఒకసారి నర్సాపురంలో ఓ ముసలాయన్ని ప్రాణం వుండగానే ఇంటి బయటవేసిన గుడారంలోకి మార్చే వరకూ వూరుకోలేదు. ఆ సంఘటన ప్రభావంతో నివసించడానిగ్గాక పోయినా ప్రశాంతంగా చనిపోయేందుకైనా స్వంత ఇల్లు వుండాలన్పించింది. ఆ నేపథ్యంలో ఈ కథ రాశాను. అప్పట్లో రా.వి.శాస్త్రిగారు, వారి మిత్రులూ ప్రతి నెలా వివిధ పత్రికల్లో వచ్చిన ఉత్తమ కథల గురించి పేర్కొనేవారు. ఆ నెలలో ఈ కథని వారు పేర్కొనడం మహద్భాగ్యం.

-సింహ ప్రసాద్
సెల్: 98490 61668

ముందు రేటు బాగా పెరుగుతుంది. మంచి లాభదాయకమంటూ పట్టుబట్టాడు చిన్నోడు. ఇద్దరూ ఇల్లు కొనడమంత వెర్రిపని ఇంకోటి లేదన్నారు. ఇల్లు కోసం పెట్టుబడి పెడితే ఆ విలువ అంతకంతకూ తగ్గిపోతుంది తప్ప ఏ రకం గానూ పెరగదనీ, లాభసాటికాదనీ లాభనష్టాలు బేరీజువేసి మరీ చెప్పేరు. కాని నేను విన్లేదు.

ఫలితంగా గృహప్రవేశానికి పెద్దోడు రాలేదు. చిన్నోడు వచ్చేడుగాని సత్యనారాయణ స్వామివ్రతం చేద్దాం రా అంటే రానుపొమ్మని వీధి అరుగు మీద కూర్చున్న వూరివాళ్ళతో ఇల్లుకొని నేనెంత పొరబాటు చేశానో, అదెంత నష్టకరమో వివరిస్తూ కూర్చున్నాడు!

అయినా నేను బాధపళ్ళేదు. ఎంచేతంటే 'నా వాళ్ళు' అనుకోవడంలో ఎంత తృప్తీ, ఆనందం వున్నాయో, 'నా ఇల్లు' అనుకోవడంలోనూ అంతే ఆనందం వుంది. కాని వాళ్ళకి స్వంత ఇంట్లో వుండే ఆనందం ఆవశ్యకత అనుబంధం అర్థం గావు. నాకు స్వానుభవంతో ఆ విషయం తెలిసి వచ్చింది. గనుకనే రిటైరయ్యేక చేతిలోపడ్డ డబ్బుతో పుట్టి పెరిగిన పల్లెలో ఓ చిన్న ఇల్లు కొన్నాను. నేనింత పట్టుదల వహించడం వెనుకో అనుభవపు ముద్ర వుంది.


ఇది ఇరవై ఏళ్ళ నాటి మాట. అప్పుడు మా పిల్లలిద్దరూ బాగా చిన్నవాళ్ళే. నేనో చిన్న టౌన్లో పన్చేస్తున్నాను. మాతో బాటు మా అమ్మగారు కూడా వుండే వారు. ఆవిడప్పటికే అరవై ఏళ్ల ముసలావిడ. పైగా ఒకటే సుస్తీ.

సాధారణంగా టౌన్లో వుండే ప్రతి వుద్యోగస్తుల్లానే మేమూ ఓ అద్దె కొంపలో వుండేవాళ్ళం. అది కూడా నా జీతాన్ని లెక్కలోకి తీసుకుని కుదుర్చుకోవడం వల్ల ఓ రెండు గదులూ, వంటకో పక్కన షెడ్డూ మాత్రం వున్న పోర్షన్లో వుండేవాళ్ళం.

మా అమ్మ రోగిష్టి అని చెప్పేనుగా. నిజానికా ఒక్క వాటాచాలదు కూడానూ. ఆవిడ మంచం మీద లేవలేకుండా వుండేది. మలం, మూత్రం అన్నీ మంచం మీదే. అంచేత ఆవిడకో గది కేటాయించేశాం. అయినా ఆ వాసననీ అదీ భరించడం చాలా కష్టమయ్యేది. తలచుకుంటే ఇప్పటికి కంపరం పుట్టడమే గాక పగవాళ్ళక్కూడా అలాంటి స్థితి రాకూడ దన్పిస్తూంటుంది.

ఏమైనా మాకు తప్పదుగనుక పక్క పోర్షన్లవాళ్ళూ, ఇంటిగల వాళ్ళూ ఎంత మొఖం మీదే విసుక్కున్నా, సణుకున్నా అన్నీ మౌనంగా తలొంచి భరించేవాళ్ళం!

ఇక్కడ మా ఆవిడ గురించో ముక్క చెప్పడం చాలా అవసరం. మా అమ్మ కింత అనారోగ్యంగా వున్నా మా అక్క ఎక్కువగా చూట్టానికైనా వచ్చేది కాదు. వచ్చినప్పుడైనా ముళ్ళమీద కూర్చున్నట్టుండేది. మొఖం చూపించి మొక్కుబడి తీర్చుకున్నట్లు వెళ్ళిపోయేది తప్ప ఎన్నడూ మా అమ్మగారి పక్కబట్ట మార్చి ఎరగదు. ఆ వచ్చిన ప్రతిసారీ మా అమ్మ దగ్గర బంగారం లేదని ఇదయ్యేది. పాపం మా ఆవిడే అన్నీ చేసేది, చిన్న పిల్లలకి చేసినట్టు అన్నీ ఎత్తిపోసేది. స్నానం చేయించి బట్ట కట్టేది. ఇప్పుడే లోకాన వుందో గానిపోయే ముందనేది మా అమ్మ మా ఆవిడ చేతులు పట్టుకుని "నేను ఓ




కూతుర్ని కన్నాను కాని అది నా కూతురు కాదమ్మాయ్, నువ్వే నా కూతురువి. నీకేమైనా ఇచ్చి పోదామంటే కాసు బంగారం కూడాలేదు ఒంటి మీద!'' అని బాధపడేది. మా ఆవిడ చేసిన సేవకు ఆ ఒక్క కితాబు చాలు.

ఒకరోజున మా అమ్మగారి పరిస్థితి మరీ క్షీణించింది. పోయే ప్రాణం వచ్చే ప్రాణంలా వుంది. ఎగశ్వాసల్లో కొచ్చేసింది. డాక్టరు కూడా ఆ రాత్రి గడిస్తే గొప్ప అన్నాడు.

మరి వార్తెలా తెలిసిందో ఏమో మా ఇంటిగలావిడొచ్చి ఆవిడ్ని బయట పెట్టేయండి లేకపోతే ఇల్లు కాళీ చెయ్యండంటూ పీకలమీద కూర్చుంది. ఇప్పుడింత అర్ధాంతరంగా ఖాళీ చెయ్యమంటే ఎలా అని బ్రతిమాల్తే ఆవిడ్ని బయటపెట్టేయండి పోనీ, ఇంట్లో చచ్చిపోతే మళ్ళీ ఈ ఇంట్లో అద్దెకి వుండటానికి జడుస్తారని పట్టుబట్టింది.

ఇక తప్పేదేముంది? అది ఎంత అమానుష మన్పించినా మరో మార్గాంతరం లేక మా ఇంటి ముందు రోడ్డు పక్కన రెండు మూడు తాటి ఆకుల్తోనూ ప్రక్కల్ని దుప్పట్లతోనూ చిన్న గూడులావేసి అందులో పడుకోబెట్టాం. వెంటనే పోయివుంటే బాగానే వుండేది. కాని అక్కడే రోడ్డు ప్రక్కనే మూడు రోజులపాటు తీసుకుని తీసుకుని చనిపోయింది! మా అమ్మ కళ్ళల్లోంచప్పుడు మౌనంగా వరదలై



పారిన కన్నీళ్ళు గుర్తు కొస్తే ఇప్పటికీ అన్పిస్తూంటుంది - స్వంత ఇల్లు లేని బ్రతుకూ ఒక బ్రతుకేనా అని!

అవును మరి, మాకు అప్పుడే గనుక ఏ గుడిసో వుండి వుంటే ఎంతో ఇదిగా చూసి సేవ చేసిన మేం అంతిమ క్షణాల్లో ఆవిడ్నలా రోడ్డు పక్క కీడ్చెయ్యాల్సిన దుర్గతి పట్టేది కాదు. అందుకే అన్పిస్తూంటుంది కనీసం వుండటానిగ్గాక పోయినా చావడానికైనా స్వంతానికో ఇల్లు వుండాలని!

అంచేత ఒకరకంగా మంకుపట్టుదలతోనే స్వంత ఇల్లు ఏర్పరచుకోవడమే నా జీవిత ధ్యేయంగా శ్రమించి కృషిచేసి కూడబెట్టి ఇల్లు కొన్నాను. ఆవును మా కోసమే కొన్నాను. నేను పడ్డ యమబాధ రేపు మా పిల్లలు మా గురించి పడకూడదనే ముందు చూపుతోనే కొన్నాను.

కాని వాళ్ళు నన్నపార్థం చేసుకున్నారు. అలా అని నేనెందుకంత పట్టుదలగా వున్నానో అప్పుడూ ఇప్పుడూ కూడా వాళ్ళతో చెప్పలేదు - చెప్పలేను కూడా - ఎంచేతంటే నేనెంత మేష్టర్నైనా ఆ విషయం గురించి వాళ్ళకి వివరించి చెప్పగల మాటలు నా దగ్గర లేవనుకుంటాను. ఇవాళ గాకపోయినా రేపైనా అద్దెకొంపల్లోని అగచాట్లూ, స్వంత ఇంటిలోని సౌలభ్యం వాళ్ళకు తెలియకపోతాయా అని ఆశ!

మొత్తానికేమైతేనేం పల్లెటూరు వెళ్ళడానికీ, అక్కడి మా ఇంట్లో కొన్నాళ్ళుండి రావడానికి పెద్దబ్బాయి ఒప్పుకున్నాడు గనుక ఇక అట్టే ఆలస్యం చెయ్యకుండా మా ఆవిడా, నేనూ ప్రయాణమయ్యాం.

మీ ఆరోగ్యం జాగ్రత్త - మందులవీ వాడుతూండంటూ పదే పదే హెచ్చరించాడు వాసు మమ్మల్ని రైలెక్కిస్తూ.

వాడి హెచ్చరికకి కారణం లేకపోలేదు. మరేనాటి పాపమో, ప్రారబ్దమో గాని నా ఒళ్ళంతా బాగా నీరు పట్టేసింది. గుండెకాయలో కూడా, దానికి తోడూ నాకు తరచూ చలిజ్వరం వస్తూంటుంది. పైగా పశ్చిమాద్రికి చేరిన వయస్సూ! ఇక నా ఆరోగ్యం గురించి చెప్పాల్సిందేముంది?

అంతవరకూ పట్నంలో ఆ ఇరుకు ఇళ్ళల్లో కుంచించుకుపోయిన మనుష్యుల మధ్య ప్రాణం లేని గాలి పీలుస్తూ కొంపలేవో ముంచుకు పోతున్నట్టు హడావిడిగా పరుగెత్తే మోటారు వాహనాల ధ్వనులు భరిస్తూండటం అలవాటైన మాకు పచ్చని చేలూ, పారే ఏరూ, నవ్వే చెట్లూ నోరారా పలకరించి మంచీచెడ్డా పరామర్శించే మనుష్యులూ, పల్లె సజీవ వాతావరణమూ అదీ మాకెంతో హాయినీ ఆహ్లాదాన్నీ కలిగించింది. ఊపిరి సలపని లోకం నుండి సువిశాల ప్రదేశంలో కొచ్చినట్టుగా వుంది. పంజరం నుండి తప్పించుకుని దిగంతాల కెగిరిన పక్షి హృదయంలా వుంది.

అసలు నేను రిటైరవ్వగానే మేమిద్దరం వచ్చి ఇక్కడే వుండిపోదామనుకున్నాం గాని మా పిల్లలు ఒప్పుకోలేదు. ఒక్కొక్కరి దగ్గరా ఆరేసి నెలలు చొప్పున వుండమంటూ పట్టుబట్టడంతో ఒప్పుకోక తప్పలేదు. అలా అని ఇంటికి తాళం వేసి పోవడం ఇష్టంలేక ఇంట్లో దీపం పెట్టి ఇంటిని జాగ్రత్తగా చూస్తేవాలని ఓ మాస్టారికి నామినల్ రెంట్‌కిచ్చాం. ఆయనీ మధ్య ట్రాన్స్‌ఫరై పోవడంతో ఖాళీ చేసేశాడు. అప్పట్నుంచీ మళ్ళీ ఇంకొకళ్ళకివ్వడం పడలేదు. మేం ఇలా ప్రయాణం పెట్టుకోవడానికి ఇల్లెలా వుందో అన్నదీ ముఖ్య కారణమే.

ఏమైనా ఇల్లు బాగానే వుంది. వెళ్ళిపోయిన మాష్టారుకి పిల్లల్లేక పోవడం

వల్ల కాబోలు అంతా శుభ్రంగానే వుంది. వాళ్ళు ఖాళీ చేసి రెండు నెలలైనం దున ఇంటినిండా దుమ్మూ బూజూ పేరుకునుంది. ఒకటి రెండు గబ్బిలాలు కూడా తిరుగుతున్నాయ్...

వచ్చిన రెండ్రోజులకే అంతా దులిపించి శుభ్రంగా అలికించి ముగ్గులు పెట్టించాం. ఇప్పుడిల్లు అద్దంలా కళకళలాడుతోంది. కాని గోడలు మాత్రం కాస్తరంగు వెలిశాయ్. ఎప్పుడో గృహ ప్రవేశానికి హడావిడిగా వేయించిన వెల్ల తప్ప మళ్ళీ ఇంతవరకూ సున్నం గోడ మొఖాన కొట్టిన పాపాన పోతేగా అసలూ!

ఆ మాటే అన్నాను శ్రీమతితో. ''చెరో పాతికా పంపమని రాస్తాను. వెల్ల వేయించెయ్యచ్చు. పన్లో పని పెంకు కూడా వేయించేస్తే బాగానే వుండ్ను గానీ...''

''అబ్బాయిలు కోప్పడతారేమోనండీ''

నేను మాట్లాడలేదు. ఎంచేతంటే వాళ్ళు కోప్ప డటమే కాదు కసురు కుంటారు కూడాను. కానీ ఇంట్లో నాలాంటి పేషంట్ వున్నప్పుడు ఏ క్షణా న్నైనా ''ఫాదర్ సీరియస్ – స్టార్ట్ ఇమీడియట్లీ'' అని టెలిగ్రాం వెళ్ళొచ్చు. వాళ్ళొచ్చేసరికి గుప్పెడు ప్రాణమూ అనంతవాయువుల్లో కలిసి పోనూ వచ్చు. అప్పుడిహ త్వరగా అంత్యక్రియలు జరిపిం చెయ్యడం తప్ప గత్యంతరం వుండదు. ఆ కర్మ కాండంతా ఇక్కడే జరపాల్సొస్తుంది గనుక చిన్న కార్యానిగ్గాకపోయినా పెద్దకార్యానికైనా ఇల్లు బాగు చేయించక తప్పదు. అప్పటికప్పుడు దాని క్కూడా డబ్బు సర్దుకోవడం త్వరగా పన్చిచేయిం చడం వాళ్ళకి సాధ్యమయ్యే పని కాదు. అలా అని బంధువులు పదిమందీ వస్తారు గనుక ఇంటినలా వదిలెయ్యను లేరు. అంచేత ఆ పనులేవో ఇప్పుడే కానిచ్చేస్తే వాళ్ళకేం ఇబ్బంది వుండదని నా గొడవ!

ఏమైనా రాయడానికే నిశ్చయించుకుని డబ్బు పంపమంటూ వుత్తరాలు రాశాను పిల్లలిద్దరికీ.

''వయస్సు మీరే కొద్దీ చాదస్తం పెరిగిపో తోంది'' అని చిన్నోడూ, ''పోతూ పోతూ ఆ ఇంటిని కూడా పట్టుకుపోయేట్టున్నారు చూస్తోంటే'' అని పెద్దబ్బాయి సన్నగా మందలి స్తూనే డబ్బు పంపారు.

నవ్వుకున్నాను. ఇవాళగాకపోయినా రేపైనా వాళ్ళకి నేనెందుకు చేశానో తెలీక పోతుందా!

ఓ నెల రోజులు గిర్రున తిరిగి పోయాయ్. బంధువుల్తో, స్నేహితుల్తో పరిచయస్తుల్తో కలిసి కాలం వెళ్ళబుచ్చుతోంటే ఏదో తెలీని వుత్సాహం కలుగుతోంది. మరేదో తృప్తి లభిస్తోంది!

రోజూ సాయం సంధ్యావేళ యేరువేపో, మామిడి తోటల్లోకో షికారు కెళుతుండేవాణ్ని కూడా! ఇక మా ఆవిడ సంగతి చెప్పేదేముంది. ఇరుగమ్మా పొరగమ్మల్తో కలిసి ఒకటే పోచికోలు కబుర్లు రాత్రీ పగలూ కూడా!

మరి గాలిమార్పు వల్లనో లేకపోతే నా రోగం తీరే అంతేనో తెలీదు గానీ హఠాత్తుగా ఓ రోజున నన్ను మంచం మీద పడేసింది. ఆ పడెయ్యడం టైఫాయిడ్‌లోకి మార్చిగాని వదలలేదు.

పిల్లలకి ఉత్తరాలు రాయమని మా ఆవిడ పోరసాగింది. రాస్తాన్లే అంటూ చాలారోజులు నాన్చాను. ఈ కాసిని ప్రాణాలూ పోయేక వాళ్ళెలాగూ రాక తప్పదు. మళ్ళీ ఇప్పుడే ఎంతో దూరాన వున్న వాళ్ళనవస్థ పెట్టడం ఎందుకూ అని వూరుకున్నాను గాని పరిస్థితి విషమించిందని నాకూ తెలిసి పోయింది.

ఈ ముసలి తనంలో పద్దెనిమిది లంఖణాలు చేసి ఇంకా ప్రాణంతో వున్నానూ అంటే ఆశ్చర్యకరమే మరి! ఇప్పుడ్నాకు కూర్చోగల శక్తికూడా లేదు. గ్లూకోజూ, పళ్ళరసాలూ అవీ ఎక్కడో వేళ్ళని పట్టుకు వ్రేలాడుతున్న ప్రాణాన్ని కాపాడు తున్నాయనుకుంటాను. అసలే ఒళ్ళంతా నీరు పట్టిందేమో నా పరిస్థితి మరీ ఆందోళనగా వుంది. బహుశా నా ఆయుష్షింక రోజుల్లోనే వుందన్పి స్తోంది. అందుకే పిల్లలిద్దరికీ నాకు ఒంట్లో బావుం డలేదనీ, శలవు దొరికితే ఓసారి వచ్చి చూసి వెళ్ళ మనీ వుత్తరాలు రాయించాను.

ఏ క్షణంలో వుత్తరం రాయించానో గాని అప్ప ట్నుంచీ నా చూపులు వీధి గుమ్మానికి అంటుకు పోయాయి. వాళ్ళని కడసారిగా చూడకుండానే పోతానేమోనని ఒకటే బెంగగా వుంది. ఇక నా శ్రీమతి వంక చూస్తే చాలు దుఃఖం వెల్లువలా పొంగివస్తోంది. ఒకటా రెండా ముప్పయ్యేళ్ళు ఆత్మీయ స్నేహితుల్లా కలసి వున్నాం. కష్టసుఖాల్ని కలబోసి పంచు కున్నాం, మంచి వచ్చినా, చెడ్డవ చ్చినా, పొంగినా, కృంగినా అన్నీ కలిసే అనుభ వించాం. అలాటిదిప్పుడు తనని ఒంటరిగా వది లేసి నా మానాన నేను వెళ్ళిపోతున్నాను...! ఆ మాట తలచుకుంటే చాలు గుండెల్ని ఉక్కు హస్తా లతో పిండేస్తున్నంత బాధ! దానికితోడు ముత్తైదు వగా పోవాలని పదే పదే అంటూండేది పిచ్చిది! ఆఖరికి దేవుడికి మొక్కినా రెండే కోరేది. ఒకటి నేనూ, పిల్లలూ క్షేమంగా వుండాలనీ, రెండు తను ముత్తైదువుగా తనువు చాలించాలనీను! అలా టిది... రేపు దాన్ని పిల్లలూ, కోడళ్ళు ఎలా చూస్తారే ఏమో!

నా కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. తుడుచుకో వడానికి చేతుల్లేవడం లేదు. అది గమనించిన శ్రీమతి నాకళ్ళు తుడిచి బావురుమంది.

ఆమెని ఓదార్చగల శక్తి, ఆ దుఃఖానికి ఆనకట్ట వెయ్యగల స్థైర్యమూ నాకిప్పుడు కొంచెం కూడా లేవు!

నేను భయపడుతున్నట్టుగానే అంతిమ క్షణాలు చేరువయ్యాయ్. అందుకు ప్రత్యక్ష నిద ర్శనం నా అసహాయ స్థితే. మాట పడిపోయింది. ఊపిరి పీల్చుకోవడం కష్టంగా వుంది. శరీరాంగా లేవీ నా స్వాధీనంలో వున్నట్టుగా లేవు. నీటిలో పడ్డ ఎలుకలా కొట్టుకుంటున్నాను... కాని పిల్లలు... పిల్లలింకా రా... లే... దు...!

''టెలిగ్రాము ఇవ్వండి. ఇంకోరోజు గడిస్తే అదృష్టమే'' డాక్టర్ అంటున్నాడు.

శ్రీమతి ఘొల్లుమంది. ఎవరో ఎవర్నో పంపారు



## అందరికీ దూరంగా....

ప్రభుదేవాతో ప్రేమ వ్యవహారం నయనతా రను పెళ్ళిపందిట్లోకి కాకుండా అజ్ఞాతంలోకి నడిపించేటట్టు ఉందని పలువురు సినీ ప్రము ఖులు అంటున్నారు. ప్రభుదేవా మొదటి భార్యతో విడాకులు తీసుకోకుండానే నయనతా రను పెళ్ళి చేసుకుంటున్నట్టు ప్రకటించడం సినీ పరిశ్రమలో పెద్ద దుమారాన్నే లేపింది. అటు ప్రభుదేవాను, ఇటు నయనతారను తిట్టని వారంటూ లేరు. వీటన్నింటిని తప్పించుకోవా లంటే కొద్దికాలం అందరికీ దూరంగా ఉండడమే మంచిదని నయనతార నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ముంబాయి లేదా హైదరాబాద్ లలో ఉండమన్న ప్రభుదేవా సూచనను నయన తార అంగీకరించలేదని తెలుస్తోంది. తన సొంత ప్రాంతమైన కేరళలో ఉండడానికే నయనతార మొగ్గుచూపుతోందనేది తాజా సమాచారం. నయనతార కేరళకి వెడితే తనకు ఇబ్బందన్న ప్రభుదేవా గొణుగుడును ఈ సారి లెక్కచేయకూ డదన్న అభిప్రాయంలో నయనతార ఉందట! అందుకే కేరళకు వెళ్ళడానికి సర్వం సిద్ధం చేసు కుంటోందన్న వార్తలు కోలీవుడ్‌లో జోరుగా విని పిస్తున్నాయి.

పట్నం టెలిగ్రామ్స్ ఇవ్వడానికి, వాళ్ళతో సంబంధం లేనట్లు కట్టెలా కదలక మెదలక, పలుకక పలుకరించలేక, కడకు కళ్ళతోనైన సైగ చెయ్యలేక శవంలా పడి వున్నాను.

మెల్లగా నా పరిస్థితి క్షీణించిపోతోంది. నేను పుట్టింది లగాయితూ కొట్టుకుని అలసి పోయిందేమో గుండె తాయితీగా విసుగ్గా అసహనంగా కొట్టుకుంటోంది!

నేను అనుమానిస్తూ వచ్చినట్టు ఏ పిల్లల్ల గ్గరుండగానో పోకుండా నేను కొన్న నా ఇంట్లో ఆఖరి శ్వాస వదలడం నాకు తృప్తి గానే వున్నా పిల్లల్ని చూడకుండానే పోతానే మోనని తీరని వ్యధగా, ఆందోళనగా వుంది!

''వచ్చేశారు'' ఎవరో అరిచారు.

నాకు చాలా ఆనందం వేసింది. ఉత్సాహం పురకలేసింది. నరనరంలోనూ మిగిలివున్న శక్తినంతా పోగుజేసుకుని కొంచెంగా తలతిప్పి చూశాను అతి కష్టం మీద.

పిల్లలూ, వారి భార్యాబిడ్డలూ!

మా అబ్బాయిలిద్దరూ దాదాపు ఏడుస్తు న్నంత పనిచేస్తూ వచ్చి నా మంచం మీద కూర్చుని నా చేతుల్ని తమ చేతుల్లోకి తీసు కుని ''ఎలా వుంది నాన్నా!?'' అంటున్నారు ఆందోళనగా.

ఆ ప్రయత్నంగా నా కళ్ళు చెమర్చాయ్. నా హృదయం ఆర్ద్రమయింది. కనీసం వీళ్ళ కోసమైనా మరికొన్ని రోజులపాటైనా బతి కితే బావుడ్ననిపించింది. కాని నా గడువైపో యింది! కనీసం ఓదార్చడానిక్కూడా వీల్లే కుండా నోరుపడి పోయింది. ఇంతకంటే నరకం ఏముంటుంది ఎవరికైనా?

వాళ్ళేదో మాట్లాడుకుంటున్నారు. డాక్టరు గురించీ, అతడుచేసిన వైద్యం గురించీ, నేను మంచం పట్టినప్పట్నుంచీ జరిగిన సంఘటనల గురించీనూ. నాకూ ఓ రెండు ముక్కలు చెప్పాలనుంది. ఏ దేవుడైనా కరుణించి రెండే రెండు నిమిషాలసేపు నాకు మాటిస్తే ''మీ అమ్మని జాగ్రత్తగా చూస్తూం డండ్రా, ఈ ఇంటిని అమ్మెయ్యకండ్రా'' అని చెప్పాలని ఎంతో ఇదిగా వుంది కాని వరమివ్వడానికి ఏ దేవుడూ నాక్కన్పించేంత దూరంలో లేడు!

ఎడతెగని ఆలోచనల వల్లనో, ఆవేదన వల్లనో ఏమోగాని విపరీతమైన ఆయాసంగా వుంది. ఊపిరి ఆడటం లేదు. రొమ్ము ఎగిసెగిసి పడుతోంది...

''దీపం ఆరేముందు వెలిగే వెలుగే అది. స్పష్టంగా కన్పించడం లేదూ! మంచం మీంచి దించేస్తే సరి'' ఎవరో అన్నారు.

ఆడవాళ్ళ ఏడ్పు స్థాయి పెరిగింది.

ఏదేదో అనుకుని నన్ను మంచం మీంచి దించి చాపమీద పడుకో బెట్టారు.

గుండెలెందుకో మూలిగాయ్. పోనీలే అన్పించింది. పోతూ పోతూ ఈ పట్టింపులేమిటన్పించింది. మొత్తానికీ ఇంట్లోనే... నా స్వంత ఇంట్లోనే వూపిరి విడుస్తున్నాగా అన్పించింది. మా అమ్మ అంతిమ క్షణాల్లో రోడ్డు పక్కన దిక్కులేని దాన్లా అనుభవించిన నరక యాతనతో పోలిస్తే నేను చాలా చాలా అదృష్టవంతుడ్నన్పిస్తోంది. ఆ వూహ ఎంతో సంతోషం కలిగి స్తోంటే కడసారిగా ఇంటినోసారి చూస్తే బావుండునని గుండె కొట్టు మిట్టా డుతోంది. గాని రెప్పలు... అదేవిటి బరువుగా... అబ్బా... ఇన్నాళ్ళు ఇంత బరువైన రెప్పల్నెలా భరిం చాను? ఏమిటో వూపిరి.... గాలి... అబ్బా అబ్బా అందటంలేదు... నవ రంధ్రాలన్నీ ఒక్కొక్కటి మూసేస్తున్నట్టుగా... కాని... ఎక్కడా యముని మహిషపు లోహపు గంటల సవ్వడులు విన్పిం చవేం?

''ఒళ్ళు చల్లబడిపోయిందిరా'' ఎవరో అన్నమా టలు గుసగుసలుగా చెవిలో పడ్డాయ్.

''తులసీ దళ రసం అందుకోండి'' ఇంకెవరో అంటున్నారు ఆదుర్దాగా.

''ఏమీ అనుకోనంటే ఓ మాటరా అబ్బాయ్! ఇప్పుడు ఇంట్లో ప్రాణం పోతే తిథి మంచిది కాదు గనుక కొన్నాళ్ళు ఇంటిని మైల పెట్టాల్సుంటుంది.

అందుకని బయట దొడ్లో పడుకోబెడితే... ఇంక ప్రాణం క్షణాల మీదే వుంది మరి...''

ఒరేయ్! నన్ను బయటకీడ్చెయ్యమంటున్నా వ్రా? తాడు కట్టి ఈడ్చి పారెయ్యడానికి నేను కుక్కననుకున్నావ్రా? ఇది నా ఇల్లు. నా కష్టార్జి తంతో కొన్నానురా. నా ఇంట్లో చచ్చే హక్కు కూడా నాకు లేదట్రా? నీ మైలా. నీ పీడా పాడుగాను! అబ్బా...

అంతమాటన్న ఆ మహానుబావుడ్నో సారి చూస్తే బావుణ్ణు. కాని... రెప్పలు... లేవడం లేదు. పోనీలే పోతూ పోతూ ఆ పాపిష్టివాణ్ణి చూట్టం ఎందుకూ? ఇదేవిటి నన్ను తీసుకుపోతున్నారు. నన్ను బయటికీడ్చేస్తున్నా రెవరూ? ఒరేయ్! ఒరేయ్! ఎవరూ నా గోల విన్పించుకోరేంరా. నా ఇంట్లోంచి నన్ను ఈడ్చేస్తూ నంగనాచి ఏడ్పులేడు స్తారెందుకురా దొంగ వెధవల్లారా...!

దేవుడూ! నన్ను త్వరగా తీసుకుపోవయ్యా. నా ఇంట్లోంచి నన్ను బయటికీడ్చేశాక... నేను బ్రతికుం డగానే నా కింట్లో స్థానం లేకుండా చేశాక ఇక నేను ఒక్క క్షణం కూడా బ్రత క్కూడదు గాక కూడదు....

అదిగో ఏదో అంటున్నారు. తులసిదళ రసం పోస్తారా? వద్దురా పాపాత్ము లారా నాకేం వద్దు. మిమ్మల్ని చూట్టమె పాపంరా. పోతాను మరో 'ఇల్లు'ని వెదుక్కుంటూ మరో లోకం వెళ్ళిపోతాను. వూహూ తాగనుగాక తాగను... కాని... శ్రీమతి పోస్తున్నట్లుంది రసం... అయినా సరే తాగను. నన్ను ఈడ్చే స్తుంటే ఏమన్నది గనుక? బ్రతికున్నన్నాళ్ళే ప్రేమలూ, విలువలూ, అభిమా నాలూ! చచ్చేక... కానీ నేనింకా చావలేదే! బహుశా చస్తానేమో చచ్చిపోయి నట్లు చూస్తున్నారు!

అబ్బా! ఎవర్రా గొంతు పిసుకుతోందీ? నా గుండెల మీద వుక్కు పాదా లతో తొక్కుతోందెవర్రా? అబ్బా – అమ్మా – నా ప్రతి అణువూ నా స్వాధీనం తప్పి.... అమ్మా అనుకోవడానిక్కూడా శక్తిలేదు... ఇంక శక్తి ఎందుకులే. వాళ్ళ దృష్టిలో నా బతుక్కి అర్థం లేదు. నేనిప్పుడు మృత్యు గాఢ పరి ష్వంగం కోసం ఎదురు చూడాలి. ఎలాగూ ఇన్నేళ్ళూ కలవ రించిన ఇంటి నుంచి బయటికీడ్చేశారు. ఇక మిగిలిన ఈ ఇల్లునీ, ఈ లోకాన్నీ కూడా విడిచి కొన్నిక్షణాల్లో వెళ్ళిపోతున్నందుకు సంతోషించాలి... అంతేనా?!

*

–విపుల, అక్టోబరు 1980

కవిత
poem




## నేస్తం

ఓటమిని ప్రేమించు నేస్తం
ఓటమిని ఆనందించు నేస్తం
ఓటమిని కాపాడుకో నేస్తం

ఓటమి నీకు తల్లి
ఓటమి నీ స్నేహితుడు
ఓటమి నీ బాధ్యత
ఓటమి నీ బంధువు
ఓటమి నీ గురువు

కడవరకూ... కన్నీళ్ళ వరకూ తోడుంటుంది
కాలం నుంచి గెలుపుకి వారధి వేస్తుంది
గెలుపు వాయిదా పడితే ఓదార్చుతుంది
నీ నైపుణ్యత పెంచి... నీ విలువను పెంచి
నీ సహనం పెంచి... నీ స్థాయి పెంచి
నీ బలం పెంచి... నీ భద్రత పెంచి
చివరికి... నిన్ను శిల్పంగా మార్చేస్తుంది

గెలుపు వచ్చిపోతుంది
గెలుపు గర్వాన్ని... పెంచుతుంది
చివరికి... మరో గెలుపుని చంపేస్తుంది
ప్రతీ గెలుపుకీ ఓటమి కావాలి
ప్రతీ విజేతకి ఓటమి కావాలి

**–కోనే సతీష్**
**సెల్: 95537 84387**